సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 23 । మే । 2025



ఏడాది పాలనలో.. ఒరిగిందేమీ లేదు

ఎన్డీఏ కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. -10లో



ప్రజల గుండెల్లో 'పెద్దాయన'

ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ అందరినీ ఏకతాటిపై నడిపించిన దివంగత వైఎస్.రాజారెడ్డికి పులివెందుల పెద్దాయనగా పేరుంది. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/25.6

జిల్లాలో గురువారం 25.6 – 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా చెన్నూరులో అత్యధికంగా 25.6 మి.మీ వర్షం కురిసింది. లింగాలలో 17.2 , సిద్దవటంలో 8.6, అట్లూరులో 8,చాపాడులో 7.6,ఒంటిమిట్టలో 7.4,పోరుమామిళ్లలో 7.2, పులివెందుల్లో 6.6, మైదుకూరులో 6.4, వల్లూరులో 5.8, కమలాపురంలో 4.2, దువ్వూరులో 4.2, వీఎన్‌పల్లిలో 2, కడపలో 1.6, సీకే దిన్నె, బి.మఠంలో 1.2 మి.మీ వర్షం నమోదయినట్లుఅధికారులు వెల్లడించారు.

373 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలలో భాగంగా గురువారం నిర్వహించిన గణిత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలకు గాను 3326 మంది విద్యార్థులకు గాను 373 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్ 10 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయిని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి యోగా ఎక్స్‌లెన్స్ అవార్డు



యోగా ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకుంటున్న ట్రిపుల్ ఐటీ లెక్చరర్ అశోక్

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ లో యోగా థెరపిస్ట్ సోమేపల్లి అశోక్‌కు యోగా ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. లక్నో నగరంలోని కైసర్ బాగ్‌లోని గాంధీ భవన్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ సదస్సులో ఈ అవార్డు బహూకరించారు. ఋషికుల్ యోగా పీఠ్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం యోగా ప్రచార విధానాన్ని ప్రోత్సహించేందుకు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ నలుమూల నుంచి వచ్చిన యోగా నిపుణులు ఇన్‌స్ట్రక్టర్లు, థెరపిస్టుల మధ్య మానవాళి కోసం చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అశోక్‌కు ఈ అవార్డు దక్కడం గర్వకారణంగా ఉందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

బదిలీల సహకార కేంద్రం ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి కడప యూటీఎఫ్ భవన్‌లో సహకార కేంద్రం ఏర్పాటు చేసినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. గురువారం కడప యూటీఎఫ్ భవన్ లక్ష్మి రాజా, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకుని వచ్చితొలిసారిగా బదిలీలు నిర్వహిస్తోందని, బది లీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి, ఆన్లైన్లో అప్లికేషన్ సబ్మిట్ చేయుటకు, బదిలీల ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బదిలీలలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్,ప్రకాష్ బాబు, విజయ చంద్రారెడ్డి, గంగన్న, మహబూబ్ బాషా,శివ ప్రసాద్, ప్రభాకర్, నరసింహులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

చాపాడు: గర్భిణులు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా బీపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రీ ఎక్లియాంప్సియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గర్భిణులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి 20 వారాల పాటు బీపీని అదుపులో ఉంచుకోవాలన్నారు. తరచుగా వైద్య సిబ్బందిని సంప్రదిస్తూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. డీఐఏఓ డా.ఉమా మహేశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.మల్లేషు, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, వైద్యాధికారులు ఓబులేసు, శ్రీవాణి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గూడు.. మహాగోడు!

- 35ఏళ్లుగా ఎదుగుబొదుగు లేకుండా ఉండిపోయిన ప్లాట్స్
- టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో మహానాడు నిర్వహణ
- ప్రస్తుతం ప్లాట్స్ చదును చేసిన తెలుగుదేశం పార్టీ
- యథావిధిగా స్థలాలు దక్కుతాయా? హైరానాలో అయ్యవార్లు



మహానాడు ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, కడప: జీవితంలో సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. ఆ కలలను నెరవేర్చుకునేందుకు 35ఏళ్లుగా టీచర్లు ఎదురుచూస్తున్నారు. ఎదుగుబొదుగు లేని ప్లాట్స్ డెవలప్‌మెంట్ చేసుకోవాలనే దిశగా సంఘటితమయ్యారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా సంక్రమించిన ప్లాట్‌లో ఇళ్లు కట్టుకోవాలని భావిస్తున్న సమయంలో ఒక్కసారిగా టీడీపీ గద్దలు వాలిపోయాయి. బెదిరించి స్వాహా చేయాలనే దిశగా అడుగులు వేశాయి. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహిస్తూ హద్దులు, కేటాయింపు రాళ్ల నామరూపాలు లేకుండా చేశారు. మహానాడు తర్వాత యథావిధిగా హౌస్ బిల్డింగ్ సొసైటీకీ అప్పగిస్తారా? ముప్పు తిప్పలు పెడతారా? అన్న సందిగ్ధంలో అయ్యవార్లు ఉండిపోయారు.

- 1989లో టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ 88 ఎకరాలు కడప రూరల్ పబ్బాపురం గ్రామ పరిధిలో కొనుగోలు చేసింది. అందులో 1430 మంది ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఆ భూమి వైపు ఎవరూ కన్నెత్తి చూసే పరిస్థితి లేదు, కాలక్రమేపి రింగ్‌రోడ్డు అందుబాటులోకి రావడం భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దాదాపు 17 ఏళ్ల తర్వాత 2006లో తమ సమ్మతి లేకుండా కొనుగోలు చేశారని శోత్రియందారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు మరో పదేళ్ల తర్వాత తీర్పు వెలుబడింది. టీచర్స్ అప్పీల్‌కు వెళ్లిన పిదప 1/3 వంతు శోత్రియం హక్కుదారులకు ఇవ్వాలని ఆదేశించింది. కేవలం 20 ఎకరాలకు మాత్రమే శోత్రియందారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేశారని, అందులో 1/3 వంతు ఇవ్వాల్సి ఉంటుందని టీచర్లు వివరిస్తున్నారు. ఈలెక్కన దాదాపు 6.66 ఎకరాలు మాత్రమే అప్పజెప్పాల్సి ఉంటుంది. అది అలా ఉండగా 2021లో శుభకీర్తి డెవలపర్స్ పేరిట 20 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయడంపై వివాదం తెరపైకి వచ్చింది.



35 ఏళ్లుగా నిరీక్షణ

టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కొనుగోలు చేసిన భూమిని చేజిక్కించుకోవాలని కొందరు అక్రమార్కులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆపై దౌర్జన్యం చేస్తున్నారు. ఇది వరకూ అనేక పర్యాయాలు ఉన్నతాధికారుల దృష్టికి అయ్యవార్లు తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించినా టీచర్లకు 35ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. తాజాగా ఆవే స్థలాలపై మహానాడు నిర్వహిస్తుండడంతో టీచర్లు పిడుగు పడ్డట్లుగా భావిస్తున్నారు. గౌరవంగా టీచర్లు ప్లాట్లు అప్పగిస్తారా? ముప్పుతిప్పలు పెట్టి వేధిస్తారా? అనే భావన అనేక మంది వ్యక్తం చేస్తున్నారు. టీచర్లు సొంత డబ్బుతో కొనుగోలు చేసిన స్థలాన్ని ఇప్పటికీ దక్కించుకోలేని దుస్థితి ఉంది. తెలుగుతమ్ముళ్లకు చిత్తశుద్ధి ఉంటే వివాదాలు పరిష్కరించి, టీచర్లును మద్దతుగా నిలవాల్సి ఉంది. ఇదివరకే మైదుకూరు టీడీపీ నేత బినామీ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకునే ఎత్తుగడ నేపథ్యంలో, ఉపాధ్యాయులు లోలోన మదనపడిపోతున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా మంత్రి మండిపల్లి రామప్రసాదరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిలు బాధ్యతగా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. టీచర్ల స్థలాల్లో మహానాడు నిర్వహించిన తర్వాత అంతే బాధ్యతగా న్యాయం చేసేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. ఏమేరకు బాధ్యత తీసుకుంటారో వేచిచూడాల్సిందే!

రికార్డులేకున్నా రిజిస్ట్రేషన్

పబ్బాపురం టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పరిధిలో 20 ఎకరాలకు రైత్వారీ పట్టా ఒకటి వెలుగులోకి తెచ్చారు. ఆ రైత్వారీ పట్టాకు చెందిన భూమి వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో లేదు. అయినప్పటికీ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శుభకీర్తి డెవెలపర్స్ పేరిటి రిజిస్ట్రేషన్ చేశారు. ఈమొత్తం వ్యవహారాన్ని హౌస్ బిల్డింగ్ సొసైటీ వెలుగులోకి తెచ్చింది. అప్పటి జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ జిల్లా రిజిస్ట్రార్, చింతకొమ్మదిన్నె తహసీల్దార్, టీచర్లతో కలిపి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తే 2021లో రైత్వారీ పట్టా కేటాయింపుకు చెందిన ఎలాంటి రికార్డులు అందుబాటులో లేవని స్పష్టమైంది. నకిలీ రైత్వారీ పట్టా పుట్టించినట్లు తేటతెల్లమైంది. వెబ్‌ల్యాండ్‌లో లేకపోయినా శుభకీర్తి డెవెలపర్స్‌కు రిజిస్ట్రేషన్ కావడం గమనార్హం. కాగా ఈ శుభకీర్తి డెవెలపర్స్ మైదుకూరు టీడీపీ నేత సూట్‌కేసు కంపెనీగా గుర్తించారు. ఆపై ఉపాధ్యాయ దినోత్సవం రోజున హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేయగా, గుర్తుతెలియని వ్యక్తులు అప్పట్లో కార్యాలయంపై దాడి చేశారు.

నిబంధనల మేరకే రేషన్ పంపిణీ

- జేసీ అదితి సింగ్
- జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా పంపిణీ



మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ నిబంధనలకు లోబడి రేషన్ సరుకులను వినియోగదారులకు సరఫరా చేయాలని, ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని జేసీ అదితిసింగ్ రేషన్ షాపు డీలర్లకు సూచించారు. జూన్ 1 నుంచి నిత్యావసర వస్తువులను ఎఫ్.పి. షాపుల (చౌక దుకాణాల) ద్వారానే పంపిణీ జరుగుతుందనే అంశంపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సభా భవన్ లో జిల్లాలోని డీలర్లలతో జేసీ అదితిసింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెల 1 వతేదీ నుండి 15 వతేదీ వరకు ప్రతి రోజు ప్రభుత్వం వారు నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8 నుంచి 12.00 గంటల వరకు సా. 4 నుంచి 8 గంటల వరకు ఎఫ్.పి. షాపులను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లకు ఆదేశించారు. ఎఫ్.పి. షాప్ నెం. పని వేళలు ధరలు, సరుకు నిల్వను సూచించే బోర్డును తప్పని సరిగా డిస్‌ప్లే చేయాలన్నారు. 65 ఏళ్లు పైన బడిన వారికి , దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఎఫ్.పి. షాపుల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్డుదారులందరికి ఖచ్చితమైన తూకంతో నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి రశీదును కూడా ఇవ్వాలని సూచించారు. ఇక మీదట నిత్యావసర వస్తువులు రేషన్ షాపుల ద్వారానే పంపిణీ చేయడం జరుగుతుందన్న విషయాన్ని కార్డుదారులందరు గమనించాలని, డీలర్లు కూడా ఈ విషయాన్ని ప్రతి కార్డు హోల్డర్ కుటుంబానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ చాముండేశ్వరి, డీఎం వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ రెడ్డి చంద్రిక, ఎఫ్‌పీ షాపుల డీలర్లు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



కడప పార్లమెంటు పరిశీలకులు అజయ్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పార్లమెంటు పరిశీలకులు అజయ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, ఎంపీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం గడుస్తోందని, వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటూ పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని, న్యాయపరంగా వాటిని ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. తమపై అన్యాయంగా, అక్రమంగా వ్యవహరించే వారికి భవిష్యత్‌లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అంతకుముందు కడప పార్లమెంటు పరిశీలకులుగా నియమింపబడి తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా అజయ్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి సత్కరించారు.

ఎరుపెక్కిన 'పసుపు'

- సీనియర్ నేత లక్ష్మీరెడ్డిపై 'తమ్ముళ్ల' మాటల దాడి
- ఢీ అంటే ఢీ అంటున్న పచ్చ నేతలు!

కడప రూరల్: మాటల మంటలతో కడప టీడీపీ ఎరుపెక్కింది. ఆరోపణలు.. ప్రత్యారోపణలతో రోజుకో వేడి రాజుకుంటోంది. మహానాడు నేపథ్యంలో కడపలో గురువారం మినీ మహనాడును ఏ ఘడియలో నిర్వహించారో గానీ.. అప్పటి నుంచి పార్టీ నేతల మధ్య బహిరంగంగానే ఆరోపణల సమరం సాగుతోంది. మినీ మహనాడులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఆ పార్టీకే చెందిన సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. ఆయన పార్టీకి ద్రోహం చేశారని ఒక వాయిస్ రికార్డ్‌ను వినిపించారు. దీనిపై మండిపడిన లక్ష్మీరెడ్డి తప్పని పరిస్థితుల్లోనే మీడియా ముందుకు వచ్చానని చెపుతూ, శ్రీనివాసులురెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. ఈ అంశాలు ఆ పార్టీతో పాటుప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారాయి.

తమ్ముళ్ల ఎదురుదాడి...

లక్ష్మీరెడ్డి ఆరోపణలకు శ్రీనివాసులురెడ్డితో పాటు అనుచరులకు ఆగ్రహం తెప్పించినట్లైంది. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మాధవిరెడ్డి నివాసంలో కడప నగర నాయకుల మీడియా సమావేశం ఉందని సమాచారం ఇచ్చారు. తరువాత ఈ సమావేశం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌కు మారింది. కేవలం లక్ష్మీరెడ్డి అంశానికి సంబంధించే వరుసగా మూడు మీడియా సమావేశాలు జరిగాయి. తొలుత నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆ పార్టీ కడప నగర ఉపాధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, జిలానీ బాషా, హుస్సేన్ ఖాజాపీర్, రెండవ సమావేశంలో పాలంపల్లె రాజువెంకటసుబ్బారెడ్డి, పీ రాజా, శివారెడ్డి, పాత కడప కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సాయంత్రం నిర్వహించిన మూడవ ప్రెస్‌మీట్‌కు 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి ,25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణతో పాటు బాలక్రిష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్ మణికంఠారెడ్డి, నాగేంద్రనాయుడు పాల్గొన్నారు. అలాగే హరి టవర్స్‌లో గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ కూడా మీడియా సమావేశం నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప నగర టీడీపీ నేత సుబ్బారెడ్డి తదితరులు

చిత్త శుద్ధి..విశ్వసనీయత లేదంటూ..

మీడియాతో తమ్ముళ్లు అంతా దాదాపుగా ఒకే అంశంపై మాట్లాడారు. లక్ష్మీరెడ్డిపై మాటల యుద్ధం చేశారు. లక్ష్మీరెడ్డి పార్టీలో చాలా సీనియర్ నేత 'పెద్దాయన'అంటూనే ఎదురుదాడి చేశారు. ఆయనకు చిత్త శుద్ధి లేదంటూ ఆరోపణలు గుప్పించారు.ఎమ్మెల్యే సీటును లక్ష్మీరెడ్డి కుటుంబానికి ఇస్తామని చెప్పింది వాస్తవమే. అయితే అధిష్టానం మాధవిరెడ్డికి ఇచ్చింది. ఎమ్మెల్యే సీటును ఒకరికే ఇస్తారు సర్దుకు పోవాలని వ్యాఖ్యానించారు.

- కాగా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కీలకమైన స్థానంలో ఉన్న శ్రీనివాసులురెడ్డికి చిత్త శుద్ధి ఉందా..ఉంటే ఆయన కూడా తన చిత్త శుద్ధిని నిరూపించుకోవాలి కదా..? అని ఆ పార్టీకే చెందిన కొందరు కార్యకర్తలు ప్రశ్నిస్తుండడం గమనార్హం.

ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను ప్రొటోకాల్ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా సీకే దిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో బహిరంగ సభా స్థలం వద్ద, భద్రతా ఏర్పాట్లు, ప్రొటోకాల్ నిబంధనల అమలుపై గురువారం జేసీ అదితిసింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. సభా ప్రాంగణం, పరిసరాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కడప, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, డీపీవో రాజ్యలక్ష్మి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఫైర్ ఆఫీసర్ ధర్మారావు, విద్యుత్, ఆర్అండ్‌బీ, పీఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగసభా స్థలి వద్ద కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

భద్రతా ఏర్పాట్లు పరిశీలన



మహానాడు వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐ.జి.పి (ఆపరేషన్స్) శ్రీకాంత్, డీఐజీ ప్రవీణ్, ఎస్పీలు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని సీకేదిన్నె పరిధిలోని పబ్బాపురంలో ఈనెల 27,28,29 తేదీల్లో జరగనున్న 'మహానాడు' నేపథ్యంలో ఐ.జి.పి (ఆపరేషన్స్) సి.హెచ్.శ్రీకాంత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వేదిక, ఫుడ్ కోర్ట్‌ల వద్ద చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై రాయలసీమ జిల్లా ఎస్పీలు ఈ.జి అశోక్ కుమార్, విద్యాసాగర్ నాయుడు, అధిరాజ్ సింగ్ రాణా, ఎస్.పి పి.జగదీశ్, గుంతకల్ రైల్వే ఎస్.పి రాహుల్ మీనా ఇతర పోలీస్ అధికారులకు ఐ.జి.పి(ఆపరేషన్స్) సి.హెచ్.శ్రీకాంత్ దిశా నిర్దేశం చేశారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు వారు సూచించారు. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లా, ఇతర జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

కడప కల్చరల్: స్వామి భక్తి, కార్యదక్షత, అమేయ శక్తి సంపదలకు ప్రతిరూపమైన పవన కుమారుడు హనుమంతుడికి గురువారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలలో ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకారం నిర్వహించారు. భక్తులు స్వామికి ఆకుపూజ, కుంకుమపూజ, సింధూర పూజలను నిర్వహించారు. దాదాపు అన్ని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. కడప నగరంలోని దాదాపు 25 ఆలయాలలో ఆంజనేయునికి హనుమజ్జయంతి విశేష పూజలు చేశారు.

కళకళలాడిన గండి క్షేత్రం

చక్రాయపేట: హనుమజ్జయంతి సందర్భంగా గురువారం గండి వీరాంజనేయ స్వామి సన్నిధి జైశ్రీరామ్ అనే రామనామ స్మరణతో మారు మోగింది. గండిక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో ప్రధాన,ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్,రాజగోపాలాచార్యులు లు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ముగిసిన వేడుకలు

గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి వేడుకలు గురువారంతో ముగిశాయి.చివరి రోజున త్రికాల ఆరాధన,పంచసూక్త హోమం,మన్యు సూక్త హోమం,ఆంజనేయ స్వామి మూలమంత్ర తదితర హోమాలు నిర్వహించారు.



గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో మూల విరాట్

ఘనంగా శోభాయాత్ర

గండి వీరాంజేయ స్వామి సన్నిధి నుంచి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది. చక్రాయపేటలో వెలసిన శ్రీవేంకటేశ్వర,రాచరాయ స్వామి ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర గండి నుంచి అద్దాలమర్రి, కుమార్లకాల్వ, చిలేకాంపల్లెల మీదుగా చక్రాయపేటలోని ఆలయాల వద్ద ముగించారు.ఆలయాల చైర్మన్ మోపూరి రామాంజనేయ రెడ్డి,మాజీ చేర్మెన్‌లు చక్రపాణిరెడ్డి, ఓబుళరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో 'పెద్దాయన'

- వైఎస్సార్ రాజకీయ అభివృద్ధికి తోడ్పాటు
- పులివెందుల సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి
- నేడు దివంగత వైఎస్ రాజారెడ్డి వర్ధంతి
- నివాళులర్పించనున్న వైఎస్ కుటుంబీకులు

ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ అందరినీ ఏకతాటిపై నడిపించిన దివంగత వైఎస్.రాజారెడ్డికి పులివెందుల పెద్దాయనగా పేరుంది. పులివెందుల గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా ఆయన ఎనలేని సేవలందించారు. క్రమశిక్షణ గల కార్యకర్తలను తీర్చిదిద్దడంలోనూ, కుమారులు, కుమార్తెలను ఉన్నతస్థానంలో నిలపడంలోనూ కుటుంబ పెద్దగా పెద్దాయన పాత్ర ఎనలేనిది.



దివంగత వైఎస్ రాజారెడ్డి, జయమ్మలు (ఫైల్)

పులివెందుల : తమ కుటుంబాన్ని నమ్ముకున్న వారికి అండగా నిలుస్తూ, కరవు లాంటి విపత్కర పరిస్థితుల లోనూ ఆదుకున్న నాయకుడు దివంగత వైఎస్.రాజారెడ్డి. అప్పట్లో రాష్ట్ర రాజకీయాలలో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి బిజీగా ఉన్నా పులివెందులలో అంతా తానై నడిపించేవారు. వైఎస్ రాజారెడ్డి 1925లో వెంకటరెడ్డి, మంగమ్మ దంపతులకు జన్మించారు. రాజకీయాల్లోకి రాకమునుపు నుంచి పులివెందుల్లో వైఎస్.రాజారెడ్డికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎలాంటి సమస్య అయినా ఆయన వద్దకు వెళితే పరిష్కారం అవుతుందని ప్రజల నమ్మకం. ఆయన అభిమానులు ఈ నాటికీ రాజారెడ్డిని దేవునిగా కొలుస్తున్నారంటే ఎంత ఆరాధిస్తున్నారో అర్థమవుతోంది. ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన రాజారెడ్డి పులివెందుల గ్రామ సర్పంచుగా తొలుత ప్రజా ప్రస్థానం ప్రారంభించారు. 1988 నుండి 1995 వరకు సర్పంచ్‌గా ఆయన పనిచేశారు. పులివెందులలో వీధిలైట్లు, రోడ్లు, విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి చెరువులను తవ్వించారు. అభివృద్ధి పనులు చేపడుతూనే ఆ ప్రాంత ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేవారు. నీటి సమస్య తీవ్రరూపం దాల్చినప్పుడు రాష్ట్రంలో ఇలాంటి సమస్య ఎప్పుడూ రాకూడదని పుత్రులకు హితబోధ చేసిన మహామనిషి ఆయన. తన ఆశయాల సాధనకు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సుపుత్రులలో ఇద్దరిని ప్రజలకు అంకితం చేశారు. రైతులను ఆదుకున్న దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కృషికి తోడుగా అక్కడక్కడా పెద్దాయన వైఎస్.రాజారెడ్డి పేరుతో సేవా కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అప్పట్లో రూపుదిద్దుకున్నాయి. పులివెందులలో ఆయన పేరుతో కాలనీలు వెలిశాయి.

పులివెందుల ప్రజల మనస్సుల్లో ప్రత్యేక స్థానం

దివంగత వైఎస్ రాజారెడ్డి, దివంగత జయమ్మ దంపతులు పులివెందుల ప్రాంతంలో ప్రజల మనస్సుల్లో ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. వైఎస్.రాజారెడ్డి బ్రతికున్న కాలంలో ఆ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా పులివెందుల పెద్దాయనగా పిలువబడే వైఎస్.రాజారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలు మొరపెట్టుకునేవారు. ప్రజల కోసం వైఎస్.రాజారెడ్డి ఇంటి వాకిళ్లు ఎప్పుడూ తెరిచి ఉండేవి. అంతేగాక దివంగత మహా నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి రాజకీయ అభివృద్ధికి వైఎస్.రాజారెడ్డి ఎంతో తోడ్పాటునందించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో తలమునకలై ఉండగా.. వైఎస్.రాజారెడ్డి పులివెందుల ప్రాంతంలో ప్రజల సమస్యలపట్ల, రాజకీయాలపట్ల అన్నీ తానై చూసుకొనేవాడు. తనయుడు వైఎస్ఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ఆయన తపించేవాడు.

విద్యా ప్రదాతగా:

దివంగత వైఎస్.రాజారెడ్డి పులివెందులలో పేద విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్‌ను నెలకొల్పాడు. ప్రజలకు సేవ చేయడంలో ఆయన ఎంతో తృప్తి పొందేవాడు. వైఎస్.రాజారెడ్డి, వైఎస్సార్ చూపిన బాటలోనే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్.అవినాష్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు నడుస్తున్నారని చెప్పవచ్చు. ఏదీ ఏమైనా పులివెందుల ప్రాంత ప్రజలు ఈనాటికి పెద్దాయనను మర్చిపోలేకపోతున్నారు.

నివాళులర్పించనున్న వైఎస్ కుటుంబ సభ్యులు

నేడు దివంగత వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం పులివెందులలోని డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్ సమాధుల తోటలో గల వైఎస్.జయమ్మ, రాజారెడ్డి సమాధుల వద్ద మాజీ సీఎం వైఎస్.జగన్ తల్లి, మాజీ ఎమ్మెల్యే వైఎస్.విజయమ్మ, ఇతర కుటుంబీకులు నివాళులర్పించనున్నారు. అనంతరం వైఎస్.రాజారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించనున్నారు.

ప్రజలకు కన్నీళ్లే మిగిలాయి

ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : కూటమి పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అన్నారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పనిచేసిన కాలంలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల ప్రశంసలందుకుందన్నారు. కూటమి పాలనలో మంత్రుల సబ్ కమిటీ నిర్ణయంతో రేషన్ బండ్లు నిలిచి పోయాయన్నారు. ఎండీయూ వాహనాలకు మంగళం పాడుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వృద్ధులు, వికలాంగులు కిలోమీటర్ల మేర నడచి వెళ్లి, రేషన్ షాపుల వద్ద క్యూలో నిల్చుని సరకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఎండీయూ వాహనాలతో గతంలో నిరుద్యోగులకు ఉపాధి కలిగిందని, ఆ విధానం రద్దుతో వారంతా రోడ్డున పడ్డారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామన్న చంద్రబాబు గతంలో వలంటీర్ల వ్యవస్థ, తాజాగా ఎండీయూ వ్యవస్థ రద్దు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టిందన్నారు.

పోలీస్ బైక్‌తో ఉడాయింపు

ప్రొద్దుటూరు క్రైం: ఏదైనా వాహనం కనిపించక పోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. స్టేషన్‌లోని పోలీస్ వాహనం చోరీ అయితే ఎవరికి చెప్పుకోవాలి. గురువారం అదే జరిగింది. బ్లూకోల్ట్స్ పోలీసుల వాహనంతోపాటు రూ.14 వేల నగదు అపహరించి ఉడాయించాడు ఓ నిందితుడు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలో ఇటీవల చోరీలు ఎక్కువగా జరుగుతుండటంతో ప్రొద్దుటూరు పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. అర్ధరాత్రి ఏ కారణం లేకుండా అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా రూరల్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణలో భాగంగా అతను కర్ణాటక వాసిగా గుర్తించారు. వేలి ముద్రలను తీసుకున్న తర్వాత ఎస్ఐ-2 గదిలో ఉంచారు. బుధవారం వేకువ జామున స్టేషన్‌లో ఉన్న అతను ఎస్ఐ గదిలోని రూ.14వేల నగదుతో పాటు బయట పెట్రోల్ బంకు వద్ద ఉన్న బ్లూకోల్ట్స్ బైక్ తీసుకొని పరారయ్యాడు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. తర్వాత సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రూరల్ పోలీసులను వివరణ కోరగా.. అనుమానంతో స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు చెప్పారు. డబ్బు తీసుకెళ్లలేదని, బైక్ తీసుకెళ్లినట్లు తెలిపారు.

చోరీ కేసులో జైలు శిక్ష

ఓబులవారిపల్లె: కొర్లకుంట క్రాస్ రోడ్డులో లవనూరు దామోదర్ ఉంచిన మోటారు సైకిల్‌ను సత్యసాయి జిల్లా కామసముద్రం గ్రామానికి చెందిన పటాన్ సాహెబ్ చోరీ చేశారు. మంగంపేట అగ్రహారానికి చెందిన బాలాజీ ఆటోను ధర్మవరం వద్ద శివశంకరాచారి తీసుకెళ్లాడు. ముద్దాయిలను అరెస్టు చేసి పోలీసులు కోర్టులో హాజరుపరచడంతో మెజిస్ట్రేట్ తేజసాయి జైలు శిక్ష విధించారు.

క్లుప్తంగా

స్తంభాన్ని ఢీకొని స్కూటరిస్టు మృతి



స్తంభాన్ని ఢీకొన్న బైక్.. పక్కనే మృతి చెందిన ప్రభుకుమార్

చాపాడు : మండలంలోని మైదుకూరు- ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని కొత్తపల్లె ప్రభుకుమార్(41) గురువారం మృతి చెందారు. మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన ప్రభుకుమార్ లింగాపురం వెళ్లి తిరిగి బైక్‌లో వస్తున్నారు. పల్లవోలు సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమ సమీపంలో ప్రమాదశాత్తూ బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రభుకుమార్‌కు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్ : ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ ఆన్‌లైన్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా గురువారం 2526 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా కడపలో ఐదు పరీక్షా కేంద్రాలు, ప్రొద్దుటూరులో మూడు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా 103 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌కు సంబంధించి 96.08 శాతం హాజరు నమోదైంది.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

– పది ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రచందనం దుంగలు, నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎఫ్ఓ

కడప అర్బన్ : ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్లను పోలీసులు గురువారం అరెస్టు చేసినట్లు డీఎఫ్ఓ వినీత్ కుమార్ తెలిపారు. కడపలోని తన కార్యాలయంలో విలేకరులతో డీఎఫ్ఓ మాట్లాడుతూ కడప రేంజ్ మద్దిమడుగు ఈస్ట్ బీట్‌లోని చనులబల్లి బావి ప్రదేశంలో ఎర్ర చందనం రవాణా సాగుతోందని సమాచారం అందడంతో కడప ఎఫ్ఆర్ఓ కె.ప్రసాద్, సిబ్బంది ఆ ప్రదేశానికి చేరుకుని తనిఖీలు చేపట్టారని తెలిపారు. కొందరు తమిళ కూలీలు ఎర్రచందనం దుంగలతో కనిపించడంతో పట్టుకునేందుకు ప్రయత్నించారన్నారు. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన రామన్ ఆండీ పట్టుబడగా, మిగిలిన వ్యక్తులు పరారయ్యారని పేర్కొన్నారు. సంఘటన స్థలంలో ఉంచిన పది ఎరచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పరారైన నిందితుల కోసం గాలింపు చేపట్టామన్నారు. తనిఖీల్లో పాల్గొన్న ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌తోపాటు, ఎస్.ఓబులేసు, షకీల్, కిషోర్, చౌడయ్య, నందిని, శోభారాణి,లను డీఎఫ్ఓ అభినందించారు.

కడప ఎగ్జిబిషన్‌లో 'బాల్ గేమ్'..!

మామూళ్ల మత్తులో అధికారులు, పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బాల్‌గేమ్.. ఇపుడు కడప నగరంలోని ఎగ్జిబిషన్‌లో ఇది కనిపిస్తోంది. వందల రూపాయల అక్రమార్జనతో యువకుల జేబులు ఖాళీ చేయడమే లక్ష్యంగా దీనిని సాగిస్తున్నారు. ఎంతో మంది తమ డబ్బు పోగొట్టుకుని ఇంటికి వెళ్తున్నారు. కడప నగర వాసులకు ఆహ్లాదం కలిగించేందుకు వేసవిలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఈ ఏడాది మున్సిపల్ స్టేడియం వద్ద వారాహి ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్‌ను టీడీపీ నేతలు ప్రారంభించారు. రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి 9.30 వరకు నిర్వహిస్తున్నారు. ఒక్కో వ్యక్తికి రూ.100 ప్రవేశ రుసుము నిర్ణయించారు. కుటుంబ సభ్యులు నలుగురు వెళ్తే రూ. 400 ఖర్చు చేయాల్సిందే. యువకులను ఆకర్షించి డబ్బు సంపాదనే ధ్యేయంగా నిర్వాహకులు 'బాల్‌గేమ్' ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొనాలంటే రూ.500, రూ.1000, రూ.2000 చెల్లిస్తే.. బాల్స్ ఇస్తారు. ఇది వరకూ సాయంత్రం నిర్వహించిన వారు.. ఇపుడు ఏకంగా రేయింబవళ్లు ఏర్పాటు చేశారు. కొందరు కార్పొరేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులకు పర్సంటేజీల రూపంలో సొమ్ము అందుతుండడంతో వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. యువకుల జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున 'బాల్‌గేమ్' నిర్వహిస్తున్నా పోలీసుల నిఘా కొరవడింది. కూటమి నేతల అండదండతోనే 'బాల్‌గేమ్' నిర్వహణ జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా పట్టివేత

రాయచోటి : వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ బంగారం, వెండి దోచుకెళ్లిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు పట్టుకున్నా రు. వారి నుంచి కిలో బంగారం, మూడు కిలోల వెండి, నగదు స్వాధీనం చేసుకున్నారు. రాయచోటి పోలీ స్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయు డు విలేకరులకు ఆ వివరాలు గురువారం వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా కోయలగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివ భవానీ (33) గతంలో విజయవాడ, బందర్, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి గూడెం, హనుమాన్ జంక్షన్, కోయిలగూడెం, రాజమండ్రి, తుని, అనకాపల్లి, చీపురుపల్లి ప్రాంతాలలో చోరీలకు పాల్పడ్డారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 150 కేసులలో అరెస్టయి జైలు శిక్ష అనుభవించి ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారన్నారు. బయటకు వచ్చిన వెంటనే చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవారిపల్లికి చెందిన జెట్టి సుబ్రహ్మణ్యం(27), అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మాధవరం పోడు గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకటేష్(21)లతో పరిచయం పెంచుకుని చోరీలు చేయడం మొదలు పెట్టారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రాంతాలలో వీరు దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వీరిపై బొమ్మూరు, నక్కలపల్లి, తిరుచానూరు పీఎస్‌లలో ఐదు, పీలేరు పీఎస్‌లో రెండు, రాయచోటి అర్బన్, రాజంపేట అర్బన్ పీఎస్‌లలో రెండు, ఓబులవారిపల్లి, మన్నూరు అర్బన్ పీఎస్‌లో 4 కేసులు గతంలో నమోదయ్యాయని అన్నారు. ఊటుకూరు సంజీవరాయ స్వామి దేవాలయం వద్ద ఈ నెల 21న వారిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి కోటి రూపాయలు విలువచేసే కిలో బంగారం, మూడు కిలోల వెండి, రూ.1.40లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మరింత బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీ, ఇతర వ్యక్తుల వద్ద రికవరీ చేయాల్సి ఉందన్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్ నాయుడును అభినందించారు.

ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం చేయాలి



ఆర్డీఓ కార్యాలయం ఏఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : ఇంటి వద్ద రేషన్ ఇచ్చే ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి ఆపరేటర్లు, హెల్పర్లకు జీవనోపాధి లేకుండా చేశారని ఎండీయూ ఆపరేటర్ల సంఘం జిల్లా కోశాధికారి నరసింహులు పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓకు గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా, వరద విపత్తుల సమయంలో నిత్యావసర సరకులు అందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో 9260 మంది నిరుద్యోగులు రోడ్డున పడతారన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతను ఆదుకుంటామని చెప్పిన కూటమి నేతలు ఇలా ఉన్న ఉద్యోగాలను తొలగించడం సరికాదన్నారు. ఎండీయూ వ్యవస్థను పునరుద్ధరించి అందులో పనిచేస్తున్న నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్ల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, ఆశీర్వాదం, మస్తాన్, గిరి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు





ప్రమాదంలో గాయపడిన యువకులు

వల్లూరు (చెన్నూరు): చెన్నూరు మండలంలోని శేషయ్యగారిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు గాయపడినట్లు చెన్నూరు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. చెన్నూరుకు చెందిన అతికారి రాజేష్, రాహుల్ ద్విచక్ర వాహనంపై కడప వైపు వెళ్తున్నారు. శేషయ్యగారి పల్లె వద్దకు రాగానే ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని వెనుక భాగంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇరువురి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులైన ఇరువురిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల సంఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనర్ బాలికపై అత్యాచారం

వేముల : మైనర్ బాలికపై అత్యాచారం కేసులో మండలంలోని వి.కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ మైనర్ బాలికపై శివప్రసాద్ అత్యాచారం చేసినట్లు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడాది పాలనలో.. ఒరిగిందేమీ లేదు

- జగన్ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేశారు
- వలంటీర్ల వ్యవస్థనే రద్దు చేశారు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. తన స్వగృహంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నారన్నారు. వలంటీర్ల వేతనాలను రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఏకంగా ఆ వ్యవస్థనే రద్దు చేశారన్నారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో సాంకేతిక కారణాలతో వేలిముద్రలు పడక.. రేషన్ దుకాణాల చుట్టూ కార్డుదారులు తిరగాల్సి వస్తుందన్నారు. చెత్త సేకరణ వాహనాలను తొలగించడంతో పట్టణాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోయిందన్నారు. సీబీఎస్ఈ విధానాన్ని స్కూళ్లలో రద్దు చేశారని, విద్యార్థులకు నాసిరకమైన భోజనం పెట్టారన్నారు. జగన్ ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలు మంజూరు చేయిస్తే.. కూటమి ప్రభుత్వం ప్రారంభించకుండా వాయిదా వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తిరుమల, సింహాచలంలో భక్తులు మరణించారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఇప్పుడు ఆయననే ప్రశంసిస్తూ మహానాడు నిర్వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వరదల ప్రభావానికి అమరావతిలో ఇళ్లల్లోకి వచ్చిన నీరు తోడుకుంటుంటే ప్రభుత్వం మాత్రం అద్భుతంగా నిర్మించినట్లు ప్రచారం చేస్తోందని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఏదైనా నామినేటెడ్ పోస్టు కోసం ఆయనకు బాకా ఊదుతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు వార్తలు రాస్తున్నాయేమోననే అనుమానం కలుగుతోందన్నారు. ప్రొద్దుటూరులో రూ.20 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మించలేని ప్రభుత్వం, వంద కోట్లకు సంబంధించిన తీర్మానాలను మినీ మహానాడులో ప్రవేశపెడతామనడం విచిత్రంగా ఉందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, రాగుల శాంతి, సత్యం, వంశీధర్‌రెడ్డి, బీఎస్ఆర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల పక్రియ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, పురపాలక, నగరపాలక పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల పక్రియ గురువారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 127, ఎంపీపీ, జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో 6025, పురపాలక పాఠశాలల పరిధిలో 544 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లా ప్రాతిపదికన ఉపాధ్యాయులు ఎనిమిదేళ్లు, ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్లు పనిచేసి ఉంటే తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుల బదిలీలకు 125, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి 393 దరఖాస్తులు వచ్చాయి. స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉండడంతో మరింత పెరిగే అవకాశముంది.

డీఈఓ అంతర్జాలంలో పదోన్నతి జాబితా

ఉమ్మడి కడప జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందే వారి ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా జిల్లా విద్యా శాఖ అంతర్జాలంలో ఉంచినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. జాబితాలోని ఉపాధ్యాయులు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, పీహెచ్ ఉపాధ్యాయులు మెడికల్ బోర్డు ద్వారా ఏప్రిల్ 24 తరువాత జారీ చేయడిన పత్రాలు తీసుకుని కడప మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో ఈ నెల 24న హాజరు కావాలని కోరారు. అంతర్జాలం నందు ఉంచిన చెక్‌లిస్ట్ నింపుకొని రావాలన్నారు.

నాన్న వస్తాడని...

రాజంపేట: నిండు చూలాలైన తన కుమార్తెకు కాన్పు చేయించేందుకు విదేశాల నుంచి బయలుదేరిన తండ్రి.. ఆస్పత్రి పాలై కానరాని లోకాలకు చేరారు. పెనగలూరు మండలం చక్రంపేటకు చెందిన రాజుబోయిన మనోహర్(45) రాజంపేట పట్టణంలోని రామనగర్‌లో నివాసముంటున్నారు. బ్రతుకు దెరువు కోసం ఎనిమిది నెలల కిందట కువైట్‌కు వెళ్లారు. ఇతడికి భార్య రాజేశ్వరి, కుమార్తె మౌనిక, కుమారుడు ఉన్నారు. కుమార్తె నిండు చూలాలు కావడంతో బిడ్డకు కాన్పు చేయించేందుకు తండ్రి ఈ నెల 17న ఇండియాకు వచ్చేందుకు శ్రీలంక విమానం ఎక్కినా.. ఇంటికి రాలేదు. ఆయన భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించగా మనోహర్‌కు విమానంలో ఆరోగ్య సమస్య తలెత్తడంతో కొలంబో ఆస్పత్రిలో చేర్చారని, కోలుకోలేక అక్కడే మృతి చెందారని సమాచారం వచ్చింది. మనోహర్ మృత దేహాన్ని ఇండియాకు తెప్పించాలని వారు కోరుతున్నారు.